ప్రముఖ చిత్రకారుడు అంబాజీకి విశిష్ట పురస్కారం

19న ప్రదానం

తెలుగు యూనివర్సిటీ, ఏప్రిల్ 17: ప్రముఖ చిత్రకారుడు సీవీ అంబాజీకి పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం 2022 సంవత్సరానికి గాను విశిష్ట పురస్కారానికి ఎంపికయ్యాడు. పబ్లిక్ ఆర్ట్స్, మురల్స్, స్కెచ్ వర్క్ పెయింటింగ్స్‌లో దక్షిణ భారతదేశంలోనే ప్రత్యేక గుర్తింపు పొందిన అంబాజీ ఈ పురస్కారం అందుకోనున్నారు. హైదరాబాద్‌లో అపరాధ పరిశోధన మ్యాగజైన్‌లో కార్టూన్స్, క్యారికాచర్, కవర్ పేజీ డిజైన్‌లతో ఆరంభమైన అంబాజీ ఆర్టిస్ట్ ప్రస్థానం సినిమా హోర్డింగ్స్ కటౌట్స్, చిత్ర కథాంశంతో మురల్స్‌తో సినిమా హీరోలు, నిర్మాతలను ఆకట్టుకున్నాడు. ఈ నెల 19న ఉదయం 11గంటలకు బాచుపల్లి పరిపాలన భవనం సమావేశ మందిరంలో వీసీ ఆచార్య కిషన్‌రావు అధ్యక్షతన జరగనున్న తెలుగు విశ్వవిద్యాలయం 38వ వార్షికోత్సవంలో సాహితీవేత్తలు పద్మశ్రీ ఆచార్య కొలకలూరి ఇనాక్, డాక్టర్ ఏనుగు నరసింహారెడ్డి,రిజిస్ట్రార్ ఆచార్య భట్టు రమేశ్ పాల్గొని పురస్కారాన్ని అంబాజీకి ప్రదానం చేయనున్నారు.

బీసీఏ పరీక్షా ఫీజు స్వీకరణ

ఉస్మానియా యూనివర్సిటీ, ఏప్రిల్ 17: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని బీసీఏ కోర్సు పరీక్షా ఫీజును స్వీకరించనున్నట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు ఒక ప్రకటనలో తెలిపారు. బీసీఏ రెండు, నాలుగు, ఆరో సెమిస్టర్ మెయిన్, అన్ని సెమిస్టర్ల బ్యాక్‌లాగ్ పరీక్షా ఫీజును ఈ నెల 30వ తేదీలోగా సంబంధిత కళాశాలలో చెల్లించాలని సూచించారు. ఈ పరీక్షలను వచ్చే నెలలో నిర్వహించనున్నట్లు తెలిపారు. పరీక్షా తేదీల పూర్తి వివరాలను త్వరలోనే వెల్లడిస్తామన్నారు. ఇతర వివరాలకు ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో చూసుకోవచ్చని సూచించారు.

బీఈడీ కోర్సుల పరీక్షా ఫలితాల విడుదల

ఓయూ పరిధిలోని వివిధ బీఈడీ కోర్సుల పరీక్షా ఫలితాలను విడుదల చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు ఒక ప్రకటనలో తెలిపారు. బీఈడీ (ఎంఆర్ఐ), బీఈడీ (ఎల్‌డీ), బీఈడీ (హెచ్ఐ), బీఈడీ (ఏఎస్‌డీ) తదితర కోర్సుల సెమిస్టర్ ఫలితాలను విడుదల చేసినట్లు తెలిపారు. ఈ ఫలితాలను ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు.

కందాల రామయ్యకు ఓయూ డాక్టరేట్

హైదరాబాద్, ఏప్రిల్ 17 (నమస్తే తెలంగాణ) : మనోవిజ్ఞానశాస్త్రంలో పరిశోధనకు గాను కందాల రామయ్యకు ఉస్మానియా యూనివర్సిటీ డాక్టరేట్‌ను ప్రకటించింది. ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం పర్యవేక్షణలో 'ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు ఒత్తిడిని అధిగమించే విధానాలపై ఉద్వేగప్రజ్ఞ, వృత్తిపరమైన ఒత్తిడి, మూర్తిమత్వం' అంశంపై పరిశోధనను పూర్తిచేయగా ఓయూ డాక్టరేట్‌ను ప్రకటించింది. రామయ్య ప్రస్తుతం ములుగు జిల్లా అబ్బాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గణిత ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నారు. రామయ్య 2022లో జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును సైతం అందుకున్నారు. ఈ సందర్భంగా ఓయూ సైకాలజీ ఆచార్యులు డాక్టర్ అనుపమ, డాక్టర్ పారిపల్లి శంకర్, డాక్టర్ స్వాతి, ములుగు డీఈవో పాణిని, హెచ్ఎం జీ భాస్కర్ తదితరులు రామయ్యను అభినందించారు.

సూర్యప్రతాపం

భానుడి భగభగతో జనం విలవిలలాడుతున్నారు. రోజు రోజుకు ఎండల తీవ్రత పెరగడంతో ప్రజలు బయటకు రావాలంటేనే జంకుతున్నారు. ఎండ వేడిమి తట్టుకోలేక నగర రోడ్లన్నీ బోసిపోతున్నాయి. బుధవారం శిల్పారామం నుంచి సైబర్‌టవర్స్ వెళ్లే రహదారి ఈ విధంగా నిర్మానుష్యంగా కనిపించింది.

హెచ్ఎండీఏలో సమన్వయ లోపం

ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం ఎస్టేట్‌పై ఆధిపత్య ధోరణి
ఉన్నతాధికారుల అండదండలతో ఇష్టారాజ్యం
భూముల రక్షణ లక్ష్యాన్ని పక్కన పెట్టిన అధికారులు

సిటీబ్యూరో, ఏప్రిల్ 17 (నమస్తే తెలంగాణ): విలువైన భూములను కంటికి రెప్పలా కాపాడాల్సిన అధికారులే కత్తులు దూసుకుంటున్న పరిస్థితి. సమన్వయంతో కలిసి పనిచేయాల్సిన వారు.. ఒక విభాగం అధికారులు మరో విభాగం అధికారులపై ఆధిపత్య ధోరణితో వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం అధికారుల అధిపత్యాన్ని తట్టుకోలేకపోతున్నానని, తనను వేరే విభాగానికి బదిలీ చేయాలంటే ఓ ఉద్యోగి ఎస్టేట్ విభాగం ఉన్నతాధికారికి విన్నవించుకునే దాకా వెళ్లింది. ఈ పరిస్థితి హైదరాబాద్ మహానగరాభివృద్ధిలో కీలకంగా ఉన్న హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ(హెచ్ఎండీఏ)లో నెలకొంది. నేను కమిషనర్ మనిషిని.. నేను చెప్పినట్లు వినాలి... వినకపోతే నీపై కమిషనర్‌కు ఫిర్యాదు చేస్తా.. నిన్ను సస్పెండ్ చేయిస్తాను... ఇది ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగంలోని ఓ అధికారి... ఎస్టేట్ వింగ్‌లో పనిచేసే సైట్ ఆఫీసర్‌తో అన్న మాటలు. ఇలాంటి పనితీరు హెచ్ఎండీఏలో నేనెప్పుడు చూడలేదని, ఇటీవల కొత్తగా పోలీస్ శాఖ నుంచి డిప్యూటేషన్‌పై వచ్చిన అధికారులు ఉన్నతాధికారుల అండదండలతో ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. అసలు లక్ష్యాన్ని పక్కన పెట్టి అధిపత్యం కోసం సహచర ఉద్యోగుల పై వ్యవహరిస్తున్న తీరుపై ఉద్యోగులు మండిపడుతున్నారు. హెచ్ఎండీఏలో శాశ్వత ఉద్యోగులుగా ఉన్న తమపై డిప్యూటేషన్‌పై వచ్చిన కొందరు అధికారులు తీరును భరించలేకపోతున్నామని వాపోతున్నారు.

హెచ్ఎండీఏ పరిధిలో సుమారు 8,347 ఎకరాలు

అన్యాక్రాంతమవుతున్న భూముల పరిరక్షణకు మెట్రోపాలిటన్ కమిషనర్ ప్రత్యేకంగా దృష్టి సారించారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో ఉన్న భూములు అత్యంత విలువైనవి కావడంతో వాటిని కాపాడాల్సిన అవసరం ఉందని ఉన్నతాధికారులకు ఇటీవల హెచ్ఎండీఏపై నిర్వహించిన సమీక్షా సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. ఈ మేరకు మెట్రోపాలిటన్ కమిషనర్ ఎస్టేట్ విభాగం ఉన్నతాధికారులతో సమావేశమై మొత్తం హెచ్ఎండీఏ పరిధిలో ఉన్న భూముల లెక్కలను గుర్తించాలని ఆదేశించడంతో ఆ లెక్కలు తీశారు. దాని ప్రకారం సుమారు 8347 ఎకరాలు ఉన్నట్లు తేలింది. కొన్ని చోట్ల 200-300 గజాల నుంచి మొదలు కొని ఎకరాల్లో స్థలాలు ఉన్నాయి. ఇందుకోసం మొత్తం ఏడుగురికి సైట్ ఆఫీసర్లుగా నియమించి ప్రతి రోజు వారికి కేటాయించిన భూముల వద్దకు వెళ్లి తాజా పరిస్థితులను ఎప్పటికప్పుడు ఎస్టేట్ ఆఫీసర్‌కు సమాచారం ఇచ్చేలా వ్యవస్థను నడిపిస్తున్నారు. అదేవిధంగా ఎక్కడైనా భూముల కబ్జాకు ప్రయత్నాలు జరుగుతున్నప్పుడు హెచ్ఎండీఏ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగంలో ఓ ఉన్న పోలీసు బలగాలను తీసుకొని రక్షణ చర్యలు చేపట్టాల్సి ఉంది. అవసరమైతే కబ్జాదారులపై స్థానిక పోలీస్ స్టేషన్‌లలో కేసులు నమోదు చేస్తూ విలువైన స్థలాలను కాపాడాల్సి ఉంటుంది.

భూముల పరిరక్షణలో రెండు విభాగాలు కీలకమే...

హైదరాబాద్ మహానగరాభివృద్ధిలో కీలకంగా ఉన్న హెచ్ఎండీఏ భూముల పరిరక్షణలో రెండు విభాగాల అధికారుల మధ్య పోరు తారాస్థాయికి చేరింది. హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీకి నగరం నలు మూలల ఎంతో విలువైన భూములు వేల ఎకరాలు ఉన్నాయి. ప్రస్తుత అవసరాలే కాకుండా భవిష్యత్ అవసరాల కోసం రాష్ట్ర ప్రభుత్వం పలు చోట్ల భూములను హెచ్ఎండీఏకు అప్పగించింది. ముఖ్యంగా హెచ్ఎండీఏ పరిధిలో సుమారు 30-40 చోట్ల వేర్వేరు ప్రాంతాల్లో సుమారు 8347 ఎకరాల భూములు ఉన్నాయి. ఆయా భూములు అన్యాక్రాంతం కాకుండా ఇందుకోసం ప్రత్యేకంగా రెవెన్యూ విభాగంలో ఎస్టేట్ విభాగం ఉంది. అదేవిధంగా పోలీసు బలగాలతో కూడిన ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం సైతం ఉంది. హెచ్ఎండీఏ రెవెన్యూ విభాగంలో ఎస్టేట్ ఆఫీసర్(ఈఓ)గా డిప్యూటీ కలెక్టర్ హోదా కలిగిన అధికారి ఉన్నారు. ఆయన కింద అసిస్టెంట్ ఎస్టేట్ ఆఫీసర్లు(సైట్ ఆఫీసర్స్) ఏడుగురితో పాటు తహసీల్దార్లు, ఇతర అధికారులు ఉన్నారు. వీరితో సైట్ ఆఫీసర్లు కొందరు నిత్యం క్షేత్ర స్థాయిలో ఉంటూ హెచ్ఎండీఏ భూములు కబ్జాల బారిన పడకుండా పనిచేయాల్సి ఉంటుంది. అదేవిధంగా హెచ్ఎండీఏ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగంలో డీఎస్పీ స్థాయి అధికారి, ఆయన పరిధిలో ఒక సర్కిల్ ఇన్‌స్పెక్టర్, ఒక సబ్ ఇన్‌స్పెక్టర్,పదుల సంఖ్యలో కానిస్టేబుల్స్, హోంగార్డులు ఉంటారు. ఈ రెండు విభాగాలు ఉన్నతాధికారుల నుంచి మొదలు కొని కింది స్థాయి వరకు ఉన్న కలిసి సమన్వయంతో కలిసి విధులు నిర్వహించాల్సి ఉంటుంది. కానీ గతంలో ఎప్పుడూలేని విధంగా ఎన్‌ఫోర్స్‌మెంట్, ఎస్టేట్ విభాగాల మధ్య పోరు తీవ్ర స్థాయికి చేరుకుంది. ఇప్పటికే హెచ్ఎండీఏ పరిధిలో పలు చోట్ల భూముల కబ్జాలు షరా మామూలే అన్నట్లుగా ఉన్నాయి. ముఖ్యంగా జవహర్‌నగర్‌లో వేలాది ఎకరాల్లో ఇప్పటికే వందలాది ఎకరాలు కబ్జాకు గురయినా అడ్డుకోలేకపోయారన్న ఆరోపణలు ఉన్నాయి.

గాంధీ దవాఖానలో మాక్‌డ్రిల్

బన్సీలాల్‌పేట్, ఏప్రిల్ 17 : దవాఖానలలో వందలాది మంది రోగులు ఉంటారని, అనుకోని ప్రమాదం సంభవిస్తే బయటకు వెళ్లడానికి రెండు మార్గాలు తెరిచి ఉంచాలని అగ్నిమాపక శాఖ హైదరాబాద్ జిల్లా అధికారి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. అగ్నిమాపక శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అవగాహన వారోత్సవాల్లో భాగంగా బుధవారం గాంధీ దవాఖాన ఆవరణలో మాక్ డ్రిల్ నిర్వహించారు. భవనం పై అంతస్తులలో ప్రమాదంలో చిక్కిన వారిని కిందకు దించడం, గదులలో మంటలు, పొగ నిండిపోతే ఎలా అప్రమత్తం కావాలి, మంటలను నీటి ద్వారా ఎన్ని రకాలుగా ఆర్పడానికి అవకాశాలు ఉన్నాయనే దానిని అగ్నిమాపక శాఖ సిబ్బంది చేసి చూపించారు. పొగ వలన ఊపిరి తీసుకోలేని వారిని ఎలా కాపాడాలని ఓ నర్సు చేత చేయించి వివరించారు. గాంధీ సూపరింటెండెంట్ డాక్టర్ ఎం రాజారావు మాట్లాడుతూ నాలుగేండ్ల కాలంలో ఎలాంటి చిన్న అగ్నిప్రమాదం కూడా జరగకుండా అన్ని జాగ్రత్తలు తీసుకున్నామన్నారు. దవాఖానలో పనిచేస్తున్న సిబ్బందికి ప్రతి నెలా ఇలాంటి అవగాహన శిబిరం నిర్వహించాలని ఆయన కోరారు. దవాఖాన ఆవరణలో అగ్నిమాపక శాఖ ఔట్ పోస్ట్‌లో 24 గంటల పాటు సిబ్బంది అందుబాటులో ఉన్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ముషీరాబాద్ ఫైర్ అధికారి వెంకటేశ్వర్లు, గాంధీ దవాఖాన ఔట్ పోస్ట్ ఫైర్ అధికారి ఎండీ ముస్తఫా, స్నోర్‌కల్ ఫైర్ అధికారి ఎండీ షబ్బీర్ అలీ, గాంధీ దవాఖాన డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ వినయ్‌శేఖర్, ఆర్ఎంఓ డాక్టర్ జయకృష్ణ, సెక్యూరిటీ అధికారి శివాజీ, పలువురు వైద్యులు, నర్సులు, సెక్యూరిటీ, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

పొగతో అపస్మారక స్థితిలోకి వెళ్లిన వారిని ఎలా కాపాడాలో చూపిస్తున్న సిబ్బంది

మంటలను ఎలా ఆర్పివేయాలో చూపిస్తున్న సిబ్బంది

ఆహార భద్రత నియమాలు పాటించాలి

సిటీబ్యూరో, ఏప్రిల్ 17 (నమస్తే తెలంగాణ) : వినియోగదారుల ఆరోగ్య భద్రత విషయంలో నిర్లక్ష్యం వహిస్తూ వ్యాపారమే ధ్యేయంగా పనిచేస్తున్న వ్యాపారస్తులపై జీహెచ్ఎంసీ కొరడా ఝుళిపిస్తోంది. ఇందులో భాగంగా జూబ్లీహిల్స్‌లో బేబీ లాన్ బార్ అండ్ కిచెన్‌లో కస్టమర్లకు అందించిన ఆల్కలైన్ వాటర్ బాటిళ్లు కాలపరిమితి చెల్లినట్లు ఫుడ్ సేఫ్టీ అధికారులు గుర్తించారు. బీఐఎస్ నిబంధనలు పాటించడం లేదని, వీటితో పాటు కొన్ని ఫుడ్ ప్యాక్స్‌లు కాలపరిమితి చెల్లినట్లు గుర్తించి వాటిని సీజ్ చేశారు. రూ.42.660ల విలువ గల స్టాక్, రూ.1,797ల ప్యాక్స్‌లు సీజ్ చేశామని అధికారులు తెలిపారు. ఈ బార్‌కు బెవరేజ్ సప్లయి చేస్తున్న జవహర్ నగర్ చెన్నాపురంలోని సంస్థపై దాడులు చేసి, అక్కడ తయారవుతున్న వాటిలో శాంపిల్స్ తీసుకొని ల్యాబ్‌కు పంపించామని పేర్కొన్నారు. రూ.2.58లక్షల విలువ గల స్టాక్‌ను సీజ్ చేశామని తెలిపారు.

మెరుగు కౌశిక్

నరేంద్ర పడాల్

సివిల్స్‌లో ప్రతిభ చాటిన ఓయూ విద్యార్థులు

ఉస్మానియా యూనివర్సిటీ, ఏప్రిల్ 17: సివిల్స్ ఫలితాల్లో ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థులు సత్తా చాటారు. ఓయూ ఇంజినీరింగ్ కళాశాలలో సివిల్ ఇంజినీరింగ్ విభాగంలో 2020లో బీఈ పూర్తి చేసిన మెరుగు కౌశిక్ అఖిల భారత స్థాయిలో 82వ ర్యాంకు సాధించాడు. ఆర్ట్స్ కళాశాలలో ఎంఏ పొలిటికల్ సైన్స్ రెండో సంవత్సరం చదువుతున్న నరేంద్ర పడాల్ 545 ర్యాంకు పొందాడు. ఈ సందర్భంగా వారిని పలువురు అధికారులు, అధ్యాపకులు, పరిశోధక విద్యార్థులు అభినందించారు. సివిల్స్‌లో విజయం సాధించిన విద్యార్థులతో త్వరలోనే స్ఫూర్తి సభను నిర్వహించనున్నట్లు సివిల్ సర్వీసెస్ అకాడమీ డైరెక్టర్ డాక్టర్ కొండా నాగేశ్వర్ తెలిపారు.

జేఎన్‌యూ బృందం ఐఐసిటీ సందర్శన

సిటీబ్యూరో, ఏప్రిల్ 17(నమస్తే తెలంగాణ) : జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీకి చెందిన ప్రతినిధుల బృందం హైదరాబాద్‌లోని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీ(ఐఐసిటీ)ని బుధవారం సందర్శించింది. పునరుత్పాదక ఇంధన వనరులు, క్లీన్ ఎనర్జీ తయారీలో గడిచిన కొంత కాలంగా ప్రయోగాలు చేస్తున్న ఐఐసిటీలో వారు పర్యటించారు. పరిశోధకులు డెవలప్ చేసిన గ్రీన్ హైడ్రోజన్, బయో గ్యాస్ ప్లాంట్‌ను సందర్శించిన బృందం పనితీరును అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం ఇంధన వనరులు పునర్వియోగం, శిలాజ ఇంధన వనరుల వాడకాన్ని తగ్గించడమే లక్ష్యంగా ఐఐసిటీ కృషి చేస్తుండగా.. హైదరాబాద్ కేంద్రంగా వ్యర్థాల నుంచి బయోగ్యాస్ తయారీ ప్లాంట్లను ప్రారంభించిన విషయం తెలిసిందే. కాగా ఈ బృందంలో జేఎన్‌యూ వైస్ చాన్స్‌లర్ డా. శాంతిశ్రీ దుళ్లిపూడి పండిట్, ఐఐసిటీ డైరెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, పరిశోధకులు గంగాగ్నిరావు, శైలజా రెడ్డి తదితరులు ఉన్నారు.

4రోజులుగా నీళ్లు లేవు

ప్రభుత్వ అర్బన్ వసతి గృహం విద్యార్థుల ఆందోళన

వసతి గృహంలోని రికార్డులను పరిశీలిస్తున్న సమగ్ర శిక్ష ప్రాజెక్టు డైరెక్టర్ మల్లయ్య భట్టు

ఘట్‌కేసర్,ఏప్రిల్17: ఘట్‌కేసర్ మండలం ఏదులాబాద్ సమీపంలోని అర్బన్ రెసిడెన్షియల్ వసతి గృహంలో సరైన నీటి సదుపాయం కల్పించడం లేదని మంగళవారం రాత్రి విద్యార్థులు ఆందోళనకు దిగారు. ఈ వసతి గృహంలో 93 మంది విద్యార్థులు ఉన్నారు. నాలుగు రోజులుగా నీటి సరఫరా సరిగ్గా లేకపోవడంతో విద్యార్థులు ఆందోళనకు దిగారు. సరైన మెనూ అందించడం లేదని, వసతి గృహం నిర్వహణ సరిగా లేదంటూ విద్యార్థులు అధికారులకు ఫిర్యాదు చేశారు. కాగా బుధవారం ఉదయం వసతి గృహాన్ని సమగ్ర శిక్ష స్టేట్ ప్రాజెక్టు డైరెక్టర్ మల్లయ్య భట్టు తనిఖీ చేశారు. ఈ సమయంలో వసతి గృహం ప్రత్యేక ఆఫీసర్ పోవడంతో ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులను పలు సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తాగునీరు లేక ఇబ్బందులు పడుతున్నామని విద్యార్థులు వివరించారు. ప్రత్యేక అధికారి మాధవికి పోన్‌చేసి రప్పించారు. విద్యార్థులను ఇబ్బందులకు గురిచేస్తే సహించేది లేదని హెచ్చరించారు.సమస్యలు ఉన్నప్పుడు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు.

గోల్డెన్ టెంపుల్‌లో ఘనంగా శ్రీరామ నవమి

సిటీబ్యూరో, ఏప్రిల్ 17 (నమస్తే తెలంగాణ) : బంజారాహిల్స్‌లోని హరేకృష్ణ గోల్డెన్ టెంపుల్‌లో శ్రీరామ నవమి వేడుకలు బుధవారం వైభవంగా జరిగాయి. ఉత్సవాల్లో భాగంగా శ్రీ సీతారామచంద్రుల అవతారాలలో దర్శనమిచ్చిన శ్రీరాధాగోవిందులను పువ్వులు, నూతన వస్త్రాలు, ఆభరణాలతో శోభాయమానంగా అలంకరించారు. వేద మంత్రాలు, హృద్యమైన కీర్తనలు మధ్య శ్రీ సీతారామ కల్యాణోత్సవం పూర్తి సంప్రదాయబద్ధంగా, అత్యంత కన్నుల పండువగా జరిగింది. అనంతరం శాస్త్రోక్తంగా శ్రీరామ తారక అష్టోత్తర యజ్ఞం జరిగింది. అనంతరం హరేకృష్ణ స్వర్ణ దేవాలయం అధ్యక్షుడు శ్రీ సత్య గౌర చంద్ర దాస ప్రభూజీ ప్రత్యేక ప్రవచనం నిర్వహించారు. సాయంత్రం భక్తులందరూ శ్రీసీతా రామచంద్ర భగవానుని దర్శనం చేసుకున్న తర్వాత హోమగుండానికి ప్రదక్షిణలు చేశారు. అనంతరం స్వామి వారికి జరిగిన మహా మంగళ హారతితో ఉత్సవాలు ముగిశాయి. ఈ సందర్భంగా సత్యగౌర చంద్ర దాస ప్రభూజీ మాట్లాడుతూ శ్రీరాముడు అవతరించిన శుభదినమైన చైత్ర శుక్ర నవమిని శ్రీరామనవమిగా జరుపుకుంటారని తెలిపారు. మన పాలకులు శ్రీరాముడిని ఆదర్శంగా తీసుకుని, ప్రజలందరూ శ్రీరామనామమనే తారక మంత్రాన్ని ఆశ్రయిస్తే ఇప్పుడు కూడా రామ రాజ్యం సాధ్యమవుతుందన్నారు. ఇక 'హరే కృష్ణ హరేకృష్ణ కృష్ణ కృష్ణ హరేహరే, హరే రామ హరే రామ రామ రామ హరే హరే' అనే మహామంత్రాన్ని ప్రతి దినం ఎవరు జపిస్తారో వారు అవతారపురుషులైన శ్రీరాముని, శ్రీకృష్ణుల సాన్నిధ్యాన్ని అనుభవించి శాశ్వతమైన ఆనందాన్ని పొందుతారని తెలిపారు.

కళాకారులకు విరమణ ఉండదు

పురస్కారగ్రహీతలతో సినీ నటుడు కోట శ్రీనివాసరావు, రేలంగి నరసింహారావు తదితరులు

ముషీరాబాద్, ఏప్రిల్ 17: వంశీ ఆర్ట్ థియేటర్స్ ఆధ్వర్యంలో చిక్కడపల్లి త్యాగరాయగానసభలో తెలుగు రంగస్థల దినోత్సవం బుధవారం నిర్వహించారు. ఈ వేడుకలో ప్రముఖ సినీ నటుడు కోట శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా పాల్గొని రచయిత, సినీ నటులు తుర్లపాటి రామచంద్రారావు, సుబ్బరాయశర్మలకు స్వర్ణవంశీ-యలవర్తి రాజేంద్ర ప్రసాద్ జాతీయ జీవన సాఫల్య పురస్కారాలను అందజేసి సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నాటక రంగానికి తుర్లపాటి రామచంద్రారావు విశేష సేవలందించారని కొనియాడారు. కళాకారులకు ఎప్పటికి విరమణ ఉండదని, గొప్ప నటనాప్రావీణ్యం ఉన్నవారు ప్రజల మదిలో చిరస్థాయిగా నిలిచి ఉంటారని అన్నారు. ఈ కార్యక్రమంలో సినీ దర్శకుడు రేలంగి నరసింహారావు, వంశీ సంస్థల అధినేత వంశీ రామరాజు, సుధాదేవి, యలవర్తి ధనలక్ష్మి, శైలజ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి టెక్నోస్మానియా

ఉస్మానియా యూనివర్సిటీ, ఏప్రిల్ 17: ఉస్మానియా యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ టెక్నాలజీ ప్రతి సంవత్సరం నిర్వహించే 'టెక్నోస్మానియా 2024' గురువారం నుంచి ప్రారంభంకానుంది. దీనికి సన్నాహకంగా బుధవారం 3కే రన్, ఫ్లాష్ మాబ్, బైక్ ర్యాలీ, బైక్ స్టంట్స్ కార్యక్రమాలను నిర్వహించారు. మూడు రోజుల పాటు జరగనున్న ఈ ఫెస్ట్‌లో భాగంగా ఓయూ ఎన్‌సీసీ గేటు నుంచి టెక్నాలజీ కళాశాల వరకు రన్‌ను జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం ఓయూ పరిపాలన భవనం సమీపంలోని ఎల్లమ్మ దేవాలయం ముందు రోడ్డుపై నృత్యాలు చేశారు. 'ప్రతీ నీటి చుక్కను పొదుపుగా వాడుదాం... ప్రొటెక్ట్ ఎర్త్ ప్రీషియస్ వాటర్' అనే నినాదంతో ఈ రన్‌ను నిర్వహించడం విశేషం. కళాశాలలోని కెమికల్ టెక్నాలజీ, ఫుడ్ టెక్నాలజీ, టెక్స్‌టైల్ టెక్నాలజీ, ఫార్మసీ, హోటల్ మేనేజ్‌మెంట్ విభాగాలలో వరుసగా కెటాలిసిస్, ఫుడ్ సినర్జిజం, టెక్స్ క్రోమా, టెక్నోఫార్మా, టెక్నోహాస్పిటాలిటీ పేర్లతో పోటీలను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇప్పటికే కొన్ని రాష్ట్రాల్లో తీవ్ర నీటి సంక్షోభం తలెత్తిందని గుర్తు చేశారు. రానున్న రోజుల్లో మన రాష్ట్రంలో ఆ పరిస్థితి తలెత్తే అవకాశం ఉందని అభిప్రాయపడ్డారు. అందుకే 'సేవ్ వాటర్' థీమ్‌తో ఈ పోటీలను నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ చింత సాయిలు, టెక్నోస్మానియా కన్వీనర్ ప్రొఫెసర్ శ్రీనునాయక్, వైస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ రమేశ్‌కుమార్, ప్రొఫెసర్లు బసవరావు, రాజం, డాక్టర్ పరుశురాం, డాక్టర్ ఐలయ్య, డాక్టర్ పరమేశ్వర్లు, డాక్టర్ భాస్కర్, డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ అనిత, స్టూడెంట్ కోఆర్డినేటర్ రేగ శ్యాంసుందర్ తదితరులు పాల్గొన్నారు.

ఫ్లాష్‌మాబ్ నిర్వహిస్తున్న విద్యార్థులు